# ట్రాప్... ట్రాప్...



దూరి నరసింహారెడ్డి

## కుంకుమరంగు కోక

అదొక పెద్ద వస్త్ర దుకాణం

ఆ మహా నగరంలో రద్దీ షాపింగ్ కార్నర్‌లో ఐరావతంలా దర్పంగా, ఠీవీగా వెలిగి పోతోంది.

లోపలా బయటా అమర్చిన మెర్క్యూరీ ల్యాంప్‌లు ఆ ఎత్తయిన పాలరాతి కాంప్లెక్స్‌ని ధగధగ మని మెరిపిస్తూ చుట్టూ ఉన్న ఇతర షాపుల్ని వెల వెల బోయేలా చేస్తున్నాయి.

అంత ఖరీదైన ఆ షాపు వైపు సంకోచంగా చూస్తూ బెరుకు బెరుగ్గా లోపలికి అడుగు పెట్టింది సునంద.

'చీర కొనుక్కుంటాను, తోడు రండి పిన్నీ' అని పిలిస్తే రాకుండా బెట్టు చేసిన పక్కింటావిణ్ణి మనసులోనే తిట్టుకుందామె.

అడుగు పెడుతూనే మెత్తటి కార్పెట్ ఆమె పాదాలను తాకింది.

లోపల ఎటు చూసినా బట్టల దొంతరలు.

పట్టు చీరలు, బెనారస్ చీరలు, ఆట్టహాసమైన ఫాన్సీ చీరలు... ఖరీదైనవీ... కొన్ని ఊహించ వీలు లేనంత ఖరీదైనవీ.

'పెద్ద పెద్ద షాపులకు వెళ్ళొద్దు. ఓ మోస్తరు షాపుకు వెళ్లి రెండు చీరలు కొనుక్కో' అని, ఉదయం వెయ్యి రూపాయలు చేతిలో పెట్టిన భర్త గుర్తొచ్చాడామెకు.

ఎప్పుడూ 'మన తాహతకు తగినట్టుగా వెళ్లాలి' అని హితవు చెప్పే అతడంటే ఆమెకు ఒళ్లుమంట. అందుకే. అయిదు వందలు చేసే చీరలు రెండు కొనుక్కోవడం కంటే వెయ్యి రూపాయలు పెట్టి ఒక్క చీర కొనుక్కోవడం మేలు కదా అనుకొని ఆ షాపుకు వచ్చిందామె.

నెమ్మదిగా సేల్స్‌మ్యాన్ వైపు అడుగులు వేసింది.

రంగు వెలసిన రవిక, ముతక చీర, కాళ్లకు హవాయి చెప్పలు... ఆమె మధ్య తరగతి జీవితాన్ని తెలియజేస్తున్నా– పిరుదులు దాటుతున్న ఒదులైన రింగు రింగుల జడ, విశాలమైన వీపు, నునుపైన జబ్బలు, నడుం మీద చిన్న ముడత, బాహుమూలల్లో పల్చటి చెమట... ఆమె అందాన్ని రెట్టింపు చేస్తూ అక్కడున్న వారి చూపుల్ని కట్టి పడేస్తున్నాయి.

ఆమెనే చూస్తున్న ఒక జత కళ్లు అప్పటికప్పుడే పథకాన్ని రచించాయి. అనుయాయులకు ఇవ్వవలసిన సూచనలుచేరవేశాయి.

'ఏ మోడల్ చీరలు కావాలి మేడమ్' అని అడిగాడు సేల్స్‌మ్యాన్, సునంద వైపు అటెన్షన్ పే చేస్తూ.

ఏ మోడల్ అయినా పర్లేదు. లేటెస్ట్ డిజైన్‌లో ఉండాలి' అంది సునంద – కర్చీఫ్‌తో పెదాలపై పట్టిన చెమట అద్దుకుంటూ.

'ఇది చూడండి మేడమ్. దిల్‌తో పాగల్ హై మోడల్. మాధురి కట్టిన డిజైన్. ఇది హమ్ ఆప్కే హై కౌన్,... ఇవి అన్నమయ్య చీరలు...' ఒక్కొక్కటే తీసి చూపిస్తున్నాడు సేల్స్‌మ్యాన్.

అతడు చూపించిన వన్నీ సునందకు నచ్చుతున్నాయి. ప్రతిదీ ఎంతో బ్రైట్‌గా కళ్లు చెదరగొట్టేలా ఉంది. వాటిలో సన్నటి పూలున్న నీలం రంగు చీర ఆమెకు మరీ నచ్చింది.

'ఎంత?' అనడిగింది సేల్స్‌మ్యాన్‌ని.

'రెండు వేలు మేడం. మీక్కాబట్టి పద్దెనిమిది వందలుకు వస్తుంది' అన్నాడు సేల్స్‌మ్యాన్.

ఆమె నిరాశపడిపోయింది.

ఎంత బేరం చేసినా ఆ ఎనిమిది వందలు కూడా తగ్గించి వెయ్యి రూపాయలకు ఇవ్వడం అసాధ్యం.

'ఇవి ఒద్దులెండి. వెయ్యి రూపాయల లోపు ఉంటే చూపించండి' అందామె.

సేల్స్‌మ్యాన్ వెనక్కు తిరిగి ర్యాకుల్లోంచి చీరలు లాగుతుంటే 'ఎక్స్‌క్యూజ్‌మీ మేడమ్' అంటూ ఆ షాపు మేనేజర్ వచ్చాడు.

సునందను నవ్వుతూ విష్ చేశాడు.

'మీకు ఆ చీర నచ్చింది కదా. పర్లేదు దాన్నే తీసుకోండి' అన్నాడతడు.

'ఒద్దండి. అంత పెట్టి కొనడం కష్టం' అంది సునంద – డబ్బు లేకపోవడం వల్ల సిగ్గు పడుతూ.

'అలా అనకండి. నేను ఈ షాపు మేనేజర్ని. స్టాఫ్‌కు ఇక్కడ ఫిఫ్టీ పర్సెంట్ కన్సెషన్ ఉంటుంది. మిమ్మల్ని మా అక్కయ్య అని చెప్పి బిల్లు చేయిస్తాను. ఈ మాట నేను ఊరికే అనడం లేదు. నిజంగానే మీరు మా అక్కలా ఉన్నారు' అన్నాడు మేనేజర్.

ఆమె మొహమాట పడ్తూనే చీర తీసుకుంది.

'మీరు నెక్స్ట్ మంత్ ఫస్ట్ వీక్‌లో రండి. సిక్స్టీ పర్సెంట్ డిస్కౌంట్‌తో పట్టు చీరల క్లియరెన్స్ సేల్ పెడ్తున్నాం. అయితే ఈ విషయం ఎవ్వరికీ చెప్పొద్దు. చాలా తక్కువ మంది పాత కస్టమర్లనే పిలుస్తున్నాం. వారికి మేమిచ్చే దీపావళి కానుక ఇది' అన్నాడు మేనేజర్ ప్యాక్ చేసిన చీర ఆమె చేతుల్లో పెడతూ.

ఆమె తలూపింది.

షాపు నుంచి వస్తూ వస్తూ కౌంటర్‌లో ఓనర్ వైపు చూసింది. అతడామెను పట్టించుకోలేదు. తల ఒంచుకొని నోట్లు లెక్క పెట్టుకుంటున్నాడు.

ఆ తర్వాత ఆమె రెండు మూడు సార్లు ఆ షాపుకు వెళ్లింది. ఒక్కోసారి భర్తతో పోట్లాడి డబ్బు తీసుకొని, మరోసారి చుట్టు పక్కల అప్పు చేసి.

ప్రతిసారీ ఆమెకు మేనేజర్ ఖరీదైన చీరల్ని అయిదు వందలు, ఏడు వందలకే ఇచ్చేవాడు.

'ఇవాళ మీ అదృష్టం బావుంది. మా ఓనర్ మిమ్మల్ని చూడాలనుకుంటున్నాడు' అన్నాడు మేనేజర్ – మూడు నెలల్లో నాలుగోసారి వచ్చిన సునందను పలకరిస్తూ.

ఆమెని వెంటనే తీసుకెళ్ళి కౌంటర్‌లోని ఓనర్‌కు పరిచయం చేశాడు.

'ఓ...మీరేనా!, మా మేనేజర్ చెప్తుంటాడు, చాలా సంతోషం' అన్నాడు ఓనర్ – నమస్కారం చేస్తూ.

'వెళ్లండి... మీక్కావలసిన చీర తీసుకోండి' అన్నాడు – తానే మళ్లీ...

'అది కాదు సార్. ఇవాళ మీ పుట్టినరోజు కదా. మా అక్కయ్యకు ఏదైనా స్పెషల్ డిస్కౌంట్ ఇవ్వొచ్చు కదా' అన్నాడు మేనేజర్.

సునంద ఆశగా చూసింది.

'తప్పకుండా. అయిదు వేల రేంజ్‌లోని పట్టు చీర నా తరుపున ఆమెకు ప్రెజెంట్ చెయ్, ఎట్ ఫ్రీ ఆఫ్ కాస్ట్' అన్నాడు ఓనరు.

'అబ్బే... వద్దండి' అంది సునంద మొహమాటం నటిస్తూ.

'భలే వారే...తీసుకోండి' అని, కౌంటర్‌లోంచి అతడే స్వయంగా లేచివచ్చి ఆమెకు చీర తీసిచ్చాడు.

అద్భుతమైన కుంకుమ రంగు చీర. ఉచితంగా.

## మైసూర్ శాండిల్ సోప్ వేసినట్టు నైస్ మాటలతో సంసార స్త్రీని రంకులోకి దింపిన వైనం

ఆమెకు ఏం చెప్పాలో తోచలేదు.


'పైన ట్రయల్ రూమ్ ఉంది. ఓ సారి కట్టుకొని చూడండి. మీకే కలర్ నప్పక పోతే ఇక్కడే వేరేది మార్చుకోవచ్చు' అన్నాడు.

ఆమె ఆ సందిగ్ధంలో తెలియకుండానే మెట్లెక్కింది.

ట్రయల్ రూంలో తలుపు మూసుకుంది.

చీర విప్పి అవతల పారేసి పట్టు చీర కట్టుకుంటుంటే గోడలో కలిసిపోయినట్టుగా ఉన్న ప్లైవుడ్ తలుపు తెరుచుకొని వెనుకనుంచి వచ్చాడు షాపు ఓనరు.

ఆమె బిత్తర పోయింది.



'కంగారు పడకండి. చీర ఎలా కట్టుకోవాలో చెప్పడానికి వచ్చాను. చెప్పాగా. ఈ చీర మీకు కానుక అని. నేను చెప్పినట్టుగా కట్టుకుంటే ఇటువంటి చీరలు యింకా ఎన్నో ఇస్తాను' అన్నాడు ఆమె నడుము మీద చేయి వేస్తూ.

అతడి స్పర్శ వల్ల కలిగిన సందిగ్ధంలోనుంచి ఆమె బయటపడక ముందే గట్టిగా హత్తుకున్నాడామెను. వీపు మీదుగా చేతులు జారుస్తూ ఆమెను రెచ్చగొట్టాడు. ఆమె క్రమంగా అతడి ఉచ్చులోకి వచ్చేసింది.

ఆ రోజు మొదలు ఎన్నో సార్లు చీరలు, డబ్బు ఎర చూపి అతడామెను అనుభవించాడు.

ఒక్క సునందే కాదు.

ఎంతో మంది మధ్య తరగతి ఆడవాళ్లను అతడిలా ట్రాప్ చేశాడు.

కొందరు ఎదురు తిరిగితే తన దగ్గరున్న ఆధారాలు ఇంట్లో తెలియపర్చి కుటుంబాలను నాశనం చేస్తాను – అని బెదిరించే వాడు.

ఇంకొందర్ని తనక్కావలసిక వి.ఐ.పి.ల దగ్గరకు పంపే వాడు.

ఇలాంటి ఉచ్చులోంచి బయట పడలేక, పోలీస్ కంప్లయింట్ ఇచ్చి బజారున పడలేక ఎందరో ఆడవాళ్లు గిల గిలలాడిపోతున్నారు.

తస్మాత్ జాగ్రత్త!